క్లుప్తంగా

రామునిబండ ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు



గజస్తంభం వద్ద ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో గల రామునిబండ ఆలయంలో మంగళవారం మండల పూజ నిర్వహించారు. మండల పూజలో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి పాల్గొని సీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్సీకి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమార్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, ప్రధాన కార్యదర్శి వెంకటరాజం, జైపాల్‌రెడ్డి, కొండపాక మండల పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో పోటీతత్వం పెంచుకోవాలి



విద్యార్థులను సన్మానిస్తున్న ఏసీపీ రమేశ్

మర్కూక్(గజ్వేల్): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్విజ్ పోటీలు ఎంతో దోహదపడతాయని, రాష్ట్రస్థాయిలో సత్తా చాటడం అభినందనీయమని గజ్వేల్ ఏసీపీ రమేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మర్కూక్ పాఠశాలలో విద్యార్థులు నాగ చైతన్యరెడ్డి, కీర్తనలకు సన్మాన సభ నిర్వహించారు. పాములపర్తి పాఠశాలతో పాటు జిల్లాకు పేరు తీసుకవచ్చిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుగుణాకర్, తిరుపతిరెడ్డి, నాయకులు కనకయ్య, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



లక్ష పుష్పార్చనలో భక్తులు

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో 31వ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం విష్ణు సహస్రనామ పారాయణం, లక్ష పుష్పార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బుధవారం స్వామివారి కల్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

అర్హులందరికీ లైసెన్స్‌లు



లెర్నింగ్ లైసెన్స్‌లు అందిస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గంలో డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని దరఖాస్తులు చేసుకున్న అర్హులందరికీ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో ఉచితంగా టూ వీల్, ఫోర్ వీల్ లైసెన్స్‌లు ఇప్పిస్తామని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి చేపూరి శేఖర్‌గౌడ్, బీఆర్‌ఎస్వీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి పాపని సురేశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తులు చేసుకున్న 200 మందికి ఆర్టీఏ కార్యాలయంలో లెర్నింగ్ లైసెన్స్‌లు ఇప్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకునేందుకు 13వ తేదీవరకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ ఈర్షద్ హుస్సేన్, బీఆర్‌ఎస్వీ తొగుట మండల ఇన్‌చార్జి నంట పరమేశ్వర్, రాకేశ్ తదితరులు ఉన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై వక్రీకరణ సరికాదు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరణ చేయడం తగదని, రైతులకు లబ్ధి చేకూర్చింది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు బొమ్మల యాదగిరి, కలీమొద్దీన్‌లు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులకు ఉచితంగా విద్యుత్‌ను అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. రుణమాఫీ, ఉచిత ఎరువులు, తదితర హామీలను విస్మరిస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని విమర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీని, నాయకులను విమర్శిస్తే సహించేది లేదన్నారు.

పచ్చని ఒడి.. సర్కారు బడి



పాఠశాల ఆవరణలో గాంధీ విగ్రహం చుట్టూ అలుముకున్న పచ్చదనం



పచ్చదనంతో కళకళలాడుతున్న ఆవరణ

అక్కన్నపేట(హుస్నాబాద్): పచ్చని చెట్లు.. ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటే ఎవరికైనా మనసు ప్రశాంతంగా ఉంటుంది. స్వచ్ఛమైన పైరగాలి వీస్తుంటే పచ్చదనం పందిళ్ల మధ్యలో ప్రకృతిని ఆస్వాదిస్తూ పాఠాలను నేర్చుకోవడం అంటే అందరికీ ఇష్టమే. పాఠశాలల్లో ఇలాంటి వాతావరణమే ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ఇదీ ఎక్కడో కాదు అక్కన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పచ్చదనం పరుచుకుంది అని చెప్పడంలో ఎలాంటి అతియోశక్తిలేదు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహం చుట్టూ పచ్చదనంతో కళకళలాడుతోంది. అదేవిధంగా వరండాకు ఆనుకొని క్రీడా మైదానం వద్ద నాటిన మొక్కలు పెరిగి పెద్దవై నీడనివ్వడంతో పాటు పచ్చదనం అలుముకుంది. పాఠశాలలో ఉపాధ్యాయులు అందరూ ఐక్యమత్యంగా ఉంటూ పాఠశాల అంతా పచ్చదనంతో నింపారు. దీంతో మండలంలోని మిగిలిన పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోంది.

రైతుల అభివృద్ధిని ఓర్వలేని రేవంత్‌రెడ్డి

మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



నారాయణరావుపేట మండల కేంద్రంలో..



బెజ్జంకిలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎమ్మెల్యే రసమయి, నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): తెలంగాణలో రైతుల అభివృద్ధిని చూసి ఓర్వలేక పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ధ్వజమెత్తారు. బెజ్జంకిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతులకు మేలు చేసే పథకాలు అడ్డుకోవాలని చూస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, లింగాల లక్ష్మణ్, మోహన్, కచ్చు రాజయ్య, మల్లేశం, భూమయ్య, నరేశ్, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రైతులు అర్థం చేసుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అనగోని లింగంగౌడ్ అన్నారు. మంగళవారం పాలమాకులలో జెడ్పీటీసీ ఉమ, మండల నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నంగునూరులో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సోమిరెడ్డి, సారయ్య, రమేశ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పరమేశ్వర్, అయిలయ్య పాల్గొన్నారు.

రైతులకు క్షమాపణ చెప్పాలి

సిద్దిపేటరూరల్: రేవంత్‌రెడ్డి వెంటనే రైతులకు క్షమాపణలు చెప్పాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, వైస్ ఎంపీపీ కొనయ్యగారి సంతోష్‌కుమార్‌లు అన్నారు. మంగళవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఆంజనేయులు, సర్పంచ్ దుర్గం పరశురాములు పాల్గొన్నారు. రేవంత్‌రెడ్డి మాటలను ఖండిస్తూ రూరల్ మండల ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో ఎంపీపీ కార్యాలయం వద్ద రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవిచందర్‌రావు, వైస్ ఎంపీపీ యాదయ్య పాల్గొన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చిన్నకోడూరులో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రైతు సంఘం మండల అధ్యక్షుడు మల్లేశం గౌడ్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు పాపయ్య, పీఏసీఎస్ చైర్మన్‌లు కనకరాజు, సదానందంగౌడ్, సర్పంచ్‌లు ఉమేశ్‌చంద్ర, బాబు, ఎల్లయ్య, ఎంపీటీసీలు శ్రీనివాస్, శారదరమేశ్ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు బేషరతుగా వెనక్కి తీసుకొని, రైతులకు క్షమాపణలు చెప్పాలని రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి డిమాండ్ చేశారు. సిద్దిపేటలో రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, కొండం సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై శ్రద్ధ వహించాలి



ఈత మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ అధికారులు, ప్రజాప్రతినిధులు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండల కేంద్రంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గీత కార్మికులు చెరువు కట్టపై ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్‌ఐ వినోద్ మాట్లాడుతూ.. గీత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. గత కార్మికులకు జీవనోపాధిని కల్పించాలనే లక్ష్యంతో చెరువు కట్టలు, ప్రభుత్వ స్థలాల్లో ఈత, ఖర్జూరా మొక్కలు నాటుతున్నామన్నారు. ఈత మొక్కల సంరక్షణపై గత కార్మికులు శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు దుబ్బుడు వేణుగోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ పోతురాజు లింగం, గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి కనకయ్య, ఉపాధ్యక్షులు కొల నర్సయ్య, నాచగొని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావును విమర్శిస్తే సహించం

బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు మహేశ్



మాట్లాడుతున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట నియోజకవర్గ ప్రజల గుండెల్లో మంత్రి హరీశ్‌రావు ఉన్నారని, హరీశ్‌రావును విమర్శిస్తే సిద్దిపేట పొలిమేర దాటేవరకు తరిమికొడతామని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు మేరుగు మహేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మంత్రి హరీశ్‌రావు నివాసంలో నిర్వహించిన సమావేశంలో మహేశ్ మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావును విమర్శిస్తూ ప్రెస్‌మీట్ నిర్వహించి చిల్లర వ్యాఖ్యలు చేయడం తగదని హెచ్చరించారు. ఇప్పటి నుంచి నరోత్తంరెడ్డికి సంబంధించిన అవినీతి, అక్రమాలు, అత్యాచార కేసులు ప్రతి రెండు రోజులకొకసారి మీడియా ముందు వివరిస్తామన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్యామ్‌యాదవ్, బీఆర్‌ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు కనకరాజు, బీఆర్‌ఎస్వీ పట్టణ అధ్యక్షుడు మహిపాల్‌గౌడ్, సమన్వయకర్త రమేశ్, చిన్నకోడూరు అధ్యక్షుడు రాజు, నంగునూరు మండల అధ్యక్షుడు రవి, సిద్దిపేట రూరల్ సమన్వయకర్త అరవింద్‌రెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మధు, కార్యదర్శి కనకరాజు, మహేశ్ పాల్గొన్నారు.

బహిరంగ క్షమాపణ చెప్పాలి

సిద్దిపేటరూరల్: మంత్రి హరీశ్‌రావుపై బీజేపీ నేత నరోత్తంరెడ్డి చేసిన తప్పుడు మాటలకుగాను వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని నారాయణరావుపేట మండల వైస్ ఎంపీపీ సంతోష్, ఎంపీటీసీల ఫోరం ఉపాధ్యక్షుడు హరీశ్‌లు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన నారాయణరావుపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 24 గంటలు ప్రజల కోసం పాటుపడే గొప్ప వ్యక్తిపై బీజేపీ నేత విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎల్లయ్య, మండల యువజన నాయకుడు భాస్కర్, నాయకులు దేవరాజు, బాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వర్గల్(గజ్వేల్): కొత్త లైన్ నిర్మాణం సందర్భంగా బుధవారం వర్గల్ మండలం అంబర్‌పేట 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫీడర్ పరిధిలోని అంబర్‌పేట, మీనాజీపేట, తున్కిమక్తలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలి



గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న లింగం

కోహెడరూరల్(హుస్నాబాద్): పాఠశాల స్థాయి నుంచి విద్యార్థినీ, విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలని కవి విశ్రాంత ఉపాధ్యాయుడు అనంతవరం మాణ్యిక లింగం అన్నారు. మంగళవారం మండలంలోని గుండారెడ్డిపల్లిలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల గ్రంథాలయానికి తాను రాసిన పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తరగతి పుస్తకాలతో పాటు జ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను చదవాలన్నారు. గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కరుణశ్రీ, ఉపాధ్యాయుడు రవి, రమాదేవి, మంజుల, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడాలి

దుబ్బాక: పర్యావరణ సంరక్షణ బాధ్యత అందరిపై ఉందని నెహ్రూ యువ కేంద్రం నాయకులు చేపూరి విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్ విద్యార్థులకు జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. ఇంట్లో వృథా నీరును, వర్షపు నీరు భూమిలో ఇంకేలా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రాంతికుమార్, చరిత, వైష్ణవికి పాఠశాల ప్రిన్సిపాల్ సుప్రియ చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో నెహ్రూ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ్‌గౌడ్, సిబ్బంది రవీందర్, బేగం పాల్గొన్నారు.

ఘనంగా శీత్లా వేడుకలు



అమ్మవారికి పూజలు చేస్తున్న గిరిజనులు

అక్కన్నపేట(హుస్నాబాద్): గిరిజనులైన లంబాడీలు(బంజారాలు) ఎంతో పవిత్రతో జరుపుకునే మొదటి పండగ శీత్లా. ఇందులో భాగంగా మంగళవారం అక్కన్నపేట మండలం పెద్దతండా గ్రామంలో ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లతో మహిళలు బోనాలు ఎత్తుకుని నృత్యాలు చేసుకుంటూ అమ్మవారు ఉన్న ప్రదేశానికి తరలివెళ్లారు. సంప్రదాయ దుస్తులు ధరించుకొని ఎంతో ఆనందంగా ఆట, పాటలతో తండా పొలిమేర వద్ద ఏర్పాటు చేసిన శీత్లా భవానీ వరకు వెళ్లారు. అమ్మవారికి నైవేద్యంగా గుగ్గిళ్లు, లాప్సి పాయసం సమర్పించారు. కోళ్లు మేకలను బలిచ్చి వాటిపై నుంచి పశువులను దాటించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగులోతు లక్ష్మి, ఉపసర్పంచ్ కవిత, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుగులోతు భాస్కర్‌నాయక్, నాయకులు వీరాచారి, తండా పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వివరాలు నమోదు చేసుకోవాలి



కుకునూరుపల్లిలో పంటల నమోదుపై అవగాహన కల్పిస్తున్న అధికారి

కొండపాక(గజ్వేల్): రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలను నమోదు చేసుకోవాలని గజ్వేల్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు బాబూనాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కుకునూరుపల్లిలో రైతులు సాగు చేస్తున్న పంటల తీరులను పరిశీలించి నమోదు విషయమై మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిణితో కలిసి మంగళవారం అవగాహన కల్పించారు. జూన్ 2023 వరకు పట్టాదార్ పాస్ బుక్ పొందిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని బాబూనాయక్ పేర్కొన్నారు. 18 నుంచి 59 సంవత్సరాలలోపు రైతులు బీమా పథకానికి అర్హులన్నారు. ఇదివరకు బీమా చేయించుకున్న రైతులు ఏదేని తప్పులున్నా సరి చేసుకునేందుకు, నామిని పేరును మార్చుకునేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రజిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): రైతులు తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల వద్ద పంట వివరాలను నమోదు చేసుకోవాలని ఏఓ రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని సలాఖపూర్‌లో పంట వివరాలను నమోదు చేశారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



హుస్నాబాద్: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు



గజ్వేల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, నాయకులు

గజ్వేల్‌రూరల్: జీపీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 6వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ యూనియన్ నాయకులు మహాలక్ష్మి, మల్లయ్య, నాంపల్లి, తిరుపతి, లచ్చయ్య, పెంటవ్వ, బాలవ్వ, ఎల్లం, సత్తయ్య, నరేశ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సమస్యలు పరిష్కరించి వెంటనే వారితో సమ్మెను విరమింపజేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కర్రోల్ల నవీన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో కార్మికుల సమ్మెకు కేవీపీఎస్ నాయకులు మద్దతు తెలిపారు.

హుస్నాబాద్: కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం నిరసన తెలిపారు. ఈ ర్యాలీకి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, సీపీఐ నాయకుడు గడిపె మల్లేశ్, ఏఐఎఫ్‌బీ నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్‌లు సంఘీభావం తెలిపారు.

కొండపాక(గజ్వేల్): సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయితీ కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల్‌నర్సయ్య మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి జీపీ కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పోశయ్య, ప్రభాకర్, నర్సింలు, కిన్నెర, కళవ్వ, రాజవ్వ, నాగవ్వ తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు చేపట్టిన సమ్మెకు మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కొంగరి వెంకట్‌మావో, బోయిని మల్లేశం, ఏఐటీయూసీ నాయకులు అశోక్ మద్దతు తెలిపారు.

సిద్దిపేటకమాన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు సిద్దిపేటలో అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం అందజేశారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న మంజులారెడ్డి

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా మీ ముందుకు వస్తున్నానని ప్రజలు ఆశీర్వదించాలని సామాజిక సేవకురాలు మంజులారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్‌ఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో మంజుల అక్క యువసేన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంజులారెడ్డి మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాల నుంచి తన మన భేదం లేకుండా ఆపద ఉన్నవారందరికీ ఆర్థికసాయం చేశానన్నాను. తాను చేరబోయే పార్టీ గురించి స్పష్టం చేశారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటానని, త్వరలోనే నియోజకవర్గ ప్రజలకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చేలా ప్రయత్నం చేస్తానని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ పరామర్శ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ శాసనమండలి సభ్యుడు, మాజీ మంత్రి ఎల్.రమణను మంగళవారం జగిత్యాల పట్టణంలోని స్వగృహంలో సిద్దిపేట పట్టణ పద్మశాలి సంఘం నాయకులు పరామర్శించారు. రమణ తండ్రి ఇటీవల మరణించడంతో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమణ, సిద్దిపేట పట్టణ పద్మశాలి సమాజం అధ్యక్షుడు రాజేశం, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, కోశాధికారి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి రవితేజ, కార్యవర్గ సభ్యులు బాల్‌రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

◆ చిన్న కుటుంబం చింతలేని కుటుంబం

మిరుదొడ్డి(దుబ్బాక): చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబమని పీహెచ్‌సీ డాక్టర్ అమీనా సుల్తానా అన్నారు. వరల్డ్ హెల్త్ పాపులేషన్ డేను పురస్కరించుకొని మిరుదొడ్డి మండల కేంద్రంలో మంగళవారం కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇద్దరు వద్దు ఒక్కరు ముద్దు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లింగమూర్తి, ఏఎన్‌ఎంలు సుజాత, స్వప్న, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్దన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో జనార్దన్ మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టళ్లపై జిల్లా అధికారుల పర్యవేక్షణ కరువైందని, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏ హాస్టల్లో తీసుకోవడం లేదన్నారు. విద్యార్థులకు వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంగెం మధు, వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిట్యాల శేఖర్, కార్తిక్, సుమన్, పవన్, నితిన్ పాల్గొన్నారు.

◆ పాత పెన్షన్ వర్తింపజేయాలి

నంగునూరు(సిద్దిపేట): డీఎస్సీ 2003లో ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ మంగళవారం నంగునూరు మండల పాత పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు నిమ్మ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం 2003 డీఎస్సీ అభ్యర్థులు అర్హులని, పెన్షన్ వర్తించడానికి అగస్టు 31 చివరి తేదీగా ప్రకటించారన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, వెంకటేశం, మోహన్, శ్రీకాంత్, జయపాల్ యాదవ్, కైలాసం, రామకృష్ణ, బాలకృష్ణారెడ్డి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

◆ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

వర్గల్(గజ్వేల్): విద్యార్థులు పుస్తక పఠనం అలవరచుకోవాలని వర్గల్ జెడ్పీటీసీ బాలూయాదవ్, మండల నోడల్ అధికారి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం వర్గల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పఠనోత్సవంలో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రీడింగ్ కార్నర్ గ్రంథాలయాన్ని పరిశీలించారు. అక్కడ పఠనాభ్యాసనం చేస్తున్న విద్యార్థులతో చదివించారు. ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలను ప్రశంసించారు. ఈ నెలాఖరు వరకు ప్రతి విద్యార్థి ధారళంగా చదివేలా ప్రయత్నం చేయాలని వారు ఉపాధ్యాయులకు సూచించారు.

◆ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కొండపాక(గజ్వేల్): సమస్యల పరిష్కారం కోసం ఎంఈఓ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన ధర్నా మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బాల్‌నర్సయ్య మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచుతూ మధ్యాహ్న భోజన పథకం సజావుగా సాగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నర్సింలు, ఆంజనేయులు, మల్లేశం, బాల్‌నర్సు, ఎల్లవ్వ, మల్లవ్వ, వనిత, శాంతవ్వ తదితరులు పాల్గొన్నారు.

◆ కంది విత్తనాలు పంపిణీ

అక్కన్నపేట(హుస్నాబాద్): పప్పుదినుసుల సాగు ప్రోత్సహించడం కోసం జాతీయ ఆహార భద్రత(ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం) పథకం కింద రైతులకు మంగళవారం మండలంలోని జనగామ రైతు వేదికలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీలత కంది విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు విత్తన ఖర్చు తగ్గించడంతో పాటు పప్పుదినుసుల సాగు పెంచడానికి కృషి చేస్తుందన్నారు. ఈ పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకొని పప్పుదినుసుల సాగు పెంచాలని కోరారు. ప్రభుత్వం రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను విత్తనాల నుంచి మొదలు పెడితే సాగుకు సంబంధించిన అన్ని అంశాలపై దృష్టి సారించిందన్నారు. రైతుబంధు సమితి కో-ఆర్డినేటర్ కత్తుల శంకర్, రైతులు పాల్గొన్నారు.

◆ ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు

హుస్నాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం ఎంపీ బండి సంజయ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, జిల్లా కోశాధికారి శ్రీనివాస్, కౌన్సిలర్లు స్వర్ణలత, వేణుయాదవ్, నియోజకవర్గ కో-కన్వీనర్ వేణుగోపాల్‌రావు, నాయకులు సతీశ్, వీరాచారి, నరేశ్, రవి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

గజ్వేల్‌రూరల్: అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మండల పరిధిలోని అక్కారం సర్పంచ్ బాల్‌చంద్రం పేర్కొన్నారు. గ్రామంలోని బస్టాండ్ వద్ద చేపడుతున్న దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి మంగళవారం సర్పంచ్‌కు గ్రామానికి చెందిన ముదిరాజ్‌లు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో నర్సింలు, సత్తయ్య, బాల్‌రాజు, మల్లయ్య, నర్సింలు, మల్లేషం పాల్గొన్నారు.